27

# జ్ఞానాతీతుడు శ్రీశేషుదేవులు

వైరాగ్యమనే దైవీశక్తి ఎవ్వరిలో మేల్కొని కర్మ చేస్తుందో వారిలో జ్ఞానశక్తులు ఉద్భవిస్తాయి. శ్రీ శేషుబాబు గారిలో వైరాగ్య సాధన ఫలముగా జ్ఞానశక్తులు ఉద్భవించినవి. జ్ఞానశక్తులు కలిగిన వ్యక్తికి ఆ శక్తుల వలన తనలోని తప్పులు తెలియుటేకాక, ఆత్మస్థాయిలో గత జన్మలలో తాను ఏయే సంస్కారములను పొందియున్నానో, సంస్కారముల ఫలముగా ఆత్మ చుట్టూ ఏర్పడే తన స్థూల శరీరము ఏయే సంస్కారములచేత ఏర్పడియున్నదో కూడా తెలిసిపోతుంది తన గతజన్మల స్థితి, ప్రస్తుతస్థితి, భవిష్యత్ స్థితి అన్నీ అర్థమవుతాయి. ఆకార సంబంధమైన విషయాలేగాక నిరాకార సంబంధమైన విషయాలు కూడా చూడగలుగుతారు. భవిష్యత్తులో ఏమి జరుగుతుందో తెలిపే కాలజ్ఞానము కూడా అర్థమవుతుంది. ఉదాహరణకు జ్ఞానశక్తి ఒక ఎక్స్‌రే మిషన్‌వలే పనిచేస్తూ ఉంటుంది. ఒక వ్యక్తి ఎక్స్‌రే మిషను ముందు నిల్చుని ఫొటో తీయించుకుంటే ఆ వ్యక్తికున్న అలంకరణలను, వస్త్రమును, దేహమును అన్నింటిని దాటి వాటి వెనుకనున్న ఎముకలను స్పష్టముగా చూచి ఆ మిషను ముద్రించి ఇస్తుంది. అలాగే జ్ఞానశక్తితో ఏ వ్యక్తినైనా, ఏ పరిస్థితినైనా, ఏ శాస్త్రమునైనా పరికిస్తే ఆ వ్యక్తిలోని, ఆ పరిస్థితిలోని, ఆ శాస్త్రములోని పైపైకి కనిపించే ధాంభికములనేమీ పట్టించుకోకుండా అంతర్గతముగా ఉండే దేహ, మనో, ఆత్మ గుణములను, సంస్కారములను స్పష్టముగా చూపిస్తుంది. జ్ఞానశక్తి వద్ద ఎవ్వరూ తమలోని నిజాన్ని రహస్యము చేయలేరు, మభ్యపెట్టలేరు.

లోకములో గొప్పవిగా గుర్తింపబడే విద్య, వైద్య, విజ్ఞాన శాస్త్రములవంటి అన్ని శాస్త్రములు నిస్సారమైనవే అనే సత్యము ఆ వ్యక్తికి స్పష్టముగా గోచరిస్తుంది. గొప్ప గొప్ప శాస్త్రములన్నీ వృక్షముల వంటివి మాత్రమే. ఎంత గొప్ప శాస్త్రమైతే అంత గొప్ప వృక్షము వంటిది. ఆ వృక్షములకు కొమ్మలు, రెమ్మలు, ఆకులు అన్నీ ఉంటాయి కానీ ఏ వృక్షమునకూ ఒక్క పండు కూడా ఉండదు. ఫలములనేవి భగవంతుడు ప్రసాదిస్తేనే ఎవరికైనా లభిస్తాయి. ఎవరైనా శాస్త్రముల ద్వారా జ్ఞానమునో, ఆరోగ్యమునో, ఆనందమునో, అభివృద్ధినో, లాభమునో పొందుచున్నామని భావించునదంతయు వారి మాయాభ్రమే అగుచున్నది. ఏ శాస్త్రములకు ఫలములను ప్రసాదించే శక్తి మాత్రము లేదు. వారి వారి సంస్కారముల ప్రభావముచేతను, విశ్వమంతా నిండియున్న భగవంతుని ప్రేమ చేతను మాత్రమే ఎవరైనను ఫలములను పొందుచున్నారు. మనిషి భారీ సంపదలను, సౌఖ్య పరికరములను, రక్షణ పరిస్థితులను ఎంత గొప్పగా సంపాదించుకున్నను గానీ వాటి నుండి మనిషికి ఎట్టి సుఖముగానీ, రక్షణగానీ, శాంతిగానీ లభించవు. అవన్నియు వృక్షములు మాత్రమే ఆ వృక్షములకు ఎట్టి ఫలములు ఉండవు. వాటిని పెంచుకొనుట ద్వారా మనిషి సుఖశాంతులను పొందవచ్చునని భావించునదంతా మాయాభ్రమ మాత్రమే. వాటిని కలిగియుండి



continue...

ఎవరైనా సుఖశాంతులను పొందుచున్నారంటే అవి వారి సంస్కారముల వలనను, భగవత్ప్రేమ ద్వారాను పొందుచున్నవే తప్ప ఆ పరికరముల వలన పొందుచున్నవి ఏ మాత్రము కాదు. లోక శాస్త్రముల యొక్క, లోక పరికరముల యొక్క నిష్ఫలత్వము జ్ఞానికి స్పష్టముగా గోచరించుట చేత జ్ఞాని లోక సంబంధమైన వేటిపైనా ఆధారపడక, వేటినీ నమ్మక భగవంతుడినే నమ్ముచూ భగవంతుడిపైననే ఆధారపడి జీవిస్తారు.

శ్రీ గురుదేవులు వైరాగ్యసాధన ద్వారా తనలో ఉద్భవించిన జ్ఞానశక్తుల సహాయముతో తన దేహ, మనో, ఆత్మల సంస్కారములను సంపూర్ణముగా గ్రహించినారు. ఆత్మస్థితిలోని సంస్కారములను, స్థూలశరీరము యొక్క సంస్కారములను సంపూర్ణముగా గ్రహించి ఆత్మవిమర్శ ద్వారా, పశ్చాత్తాపము ద్వారా సంపూర్ణముగా పరిశుద్ధులైనారు. శ్రీ గురుదేవుల చెంతకొచ్చిన ప్రతివారియొక్క దేహ, మనో, ఆత్మ సంస్కారములన్నీ ఆయనకు స్పష్టముగా కనిపించేవి. వాటిని బట్టి వారు తెలుసుకోవలసిన ఆత్మవిమర్శను వారికి తెలియచేస్తూ సత్యమును బోధించేవారు. వారు తెలుసుకోలేని వారిలోని తప్పులను కూడా ఆయన గ్రహించి వారిని విమర్శించేవారు. శ్రీ గురుదేవులు తనలో అణుమాత్రపు చెడునైనా సహించక సంపూర్ణముగా విమర్శించుకుని పవిత్రులైనారు. అలాగే తనవారిలో ఉండే చెడును కూడా సహించలేకపోయేవారు. శిష్యులలో, స్నేహితులలో చెడు కనిపిస్తే దానిని సంపూర్ణముగా విమర్శించి, దానిని ఆ వ్యక్తి గ్రహించుకుని, పశ్చాత్తాపపడి, కడిగివేసుకునేటట్లు చేసేవారు. ఆ విమర్శ చాలా కఠినముగా, నిర్మొహమాటముగా ఉండి ఇతరులలోని అహాన్ని దెబ్బతీసేదిగా ఉండేది. తమకు మాత్రమే తెలిసియున్న తమలోని విషయాలు ఆయనకు ఎలాగ తెలుస్తున్నాయో వారికి అర్ధమయ్యేది కాదు. తమకు కూడా తెలియని తమలోని విషయాలను కూడా ఆయన విమర్శిస్తుంటే వారు ఆశ్చర్యపోయేవారు. ఆయన విమర్శిస్తున్న చెడు విషయాలు తమలో లేవని గట్టిగా వాదించేవారు కానీ శ్రీ శేషబాబు గారి వాదన ముందు వారి వాదన నిలువలేకపోయేది. ఆయన చెప్పినది నిజమేనని, ఆ చెడు తమలో ఉన్నదనే సత్యమును వారు అంగీకరించక తప్పేది కాదు. తెరచిన పుస్తకాన్ని చదువుచున్నంత సులభముగా ఆయన ఎదుటివారి అంతరంగాన్ని గ్రహించేవారు. ఆయనతో మాట్లాడుటకు శిష్యులు కొందరు భయపడిపోయేవారు. తమ ముఖము చూస్తే చాలు తమ బుద్ధిలో ఉన్న ఆలోచనలన్నీ ఆయన చదివేస్తారని భావించేవారు. తమ కళ్ళలోకి చూస్తే చాలు తమ మనస్సులో ఉన్న భావాలన్నీ ఆయనకు అర్ధమైపోతాయని, ఆయన వద్ద దేనినీ రహస్యము చేయలేమని భావించెడివారు. శిష్యులు ఒక్కొక్కసారి ఆత్మవిమర్శను తట్టుకోలేక కోపము వచ్చి ఇంకెప్పుడూ ఆయనను కలువరాదని నిర్ణయించుకుని వెళ్ళిపోయేవారు. కానీ మరల వారిలోకి దేవతాశక్తులు ప్రవేశించి ఆ విమర్శ సంపూర్ణముగా సత్యమేనని వారికి అర్ధమయ్యేలా చేసేవారు. వారు మరల వెంటనే ఆయన వద్దకు తిరిగి వచ్చి సత్యమును



continue..

అంగీకరించేవారు. శ్రీ శేషుబాబు గారు తనలోని జ్ఞానశక్తులను తాను ఆత్మవిమర్శ చేసుకొనుట కొరకు, శిష్యులకు ఆత్మవిమర్శ నేర్పుట కొరకే వినియోగించి సద్వినియోగ పరచినారు.

భగవంతుని కొరకు సత్యమార్గములో ప్రయాణించే వ్యక్తి మార్గమధ్యములో ఎదురయ్యే మజిలీల వద్ద కొద్దిసేపు సేద తీర్చుకుని మరల ఆ మజిలీని వదిలేసి ముందుకు సాగిపోతేనే చివరకు భగవంతుడు అనే గమ్యము చేరుకోగలుగుతారు. మజిలీకి ఆకర్షితుడై మజిలీ వద్దనే ఆగిపోయే వ్యక్తి గమ్యము చేరుకోలేకపోతాడు. వైరాగ్య సాధన ద్వారా జ్ఞానశక్తులను సంపాదించుకొనుట సత్యమార్గములో చాలా గొప్ప విషయము అయినప్పటికీ జ్ఞానము కూడా సత్యమార్గములో ఎదురయ్యే ఒకానొక మజిలీయే గానీ గమ్యమగు భగవంతుడు మాత్రము కాదు. జ్ఞానమును సంపాదించుకున్న తరువాత జ్ఞానమును కూడా వదిలేసి సత్యము కొరకు ముందుకు సాగిపోతేనే ఆత్మ మరింతగా అభివృద్ధి చెంది భగవంతుడిని చేరుకునే అవకాశము కలుగుతుంది. కానీ జ్ఞానమును వీడుట చాలా కష్టమైనది. జ్ఞానమును సంపాదించుకొనిన జ్ఞానులలో చాలా మంది జ్ఞానమును వీడలేక ఆ మజిలీలోనే ఆగిపోతారు. అట్టి జ్ఞానుల ఆత్మలన్నియు జ్ఞానలోకము అనే నిరాకార లోకములో శాశ్వతముగా ఉండిపోతారు. వారికి భగవంతుని గురించి బాగుగా తెలుసుగానీ వారు భగవంతునిలో కలువలేరు. వారు జ్ఞానమును దాటి భగవంతుడిని చేరుకోలేరు. వారు జ్ఞానముతో భగవంతుని పట్టుకొనుటకు ఎంతగా ప్రయత్నించినను గానీ మరల మరల చుట్టూ తిరిగి జ్ఞానములోకే వచ్చేస్తుంటారు. జ్ఞానలోకములో ఉండిపోయిన ఆత్మలను జ్ఞానమును దాటించాలంటే భగవంతునికే సాధ్యమవుతుంది. జ్ఞానలోకములో నిలిచిపోయిన ఒక ఆత్మకు ఉదాహరణగా శ్రీ రామాయణమునందలి శ్రీరావణబ్రహ్మను చెప్పుకోవచ్చు.

శ్రీరాముని చరిత్ర వేరు, శ్రీరాముని కథ వేరు. శ్రీరాముడు ఆచరించిన పితృవాక్యపాలన, ఏకపత్నీ వ్రతము, దుష్టసంహారము వంటి దేహ ధర్మములను గూర్చి, బాహ్య విషయములను గూర్చి శ్రీరాముని కథలో వ్రాస్తారు. లోకజనులు శ్రీరాముని కథను చదివి శ్రీరాముని యెడల అభిమానమును, భక్తిని ఏర్పరచుకొనుటకును, వారు సాంఘిక ధర్మములను తెలుసుకుని మంచి పద్ధతులలో జీవించుటకొరకును ఉపయోగపడేలా శ్రీరాముని కథను వ్రాస్తారు. శ్రీరాముని చరిత్ర మాత్రం వేరే విధముగా ఉంటుంది. శ్రీరాముడు జాలి, వైరాగ్యము, ఆత్మవిమర్శ సాధనలు చేసి మూడు దైవీశక్తులను తనలో మేల్కొల్పినారు. సద్గురుశక్తితో అయోధ్యలోని ప్రజలకు, వానరులకు అందరికీ సేవ చేసినారు. జాలి, వైరాగ్యము, ఆత్మవిమర్శ, సద్గురుశక్తి అన్ని మజిలీలను వదిలివేసి సత్యమార్గములో ముందుకు సాగిపోయి ఆత్మాభివృద్ధితో అవతారునిగా

continue...

మేల్కొనినారు. తాను అవతారునిగా దేహముతో జీవించియున్న కాలమునందే తన భక్తుడగు శ్రీ ఆంజనేయస్వామి వారిలో కూడా భగవంతుడిని మేల్కొలిపి తనతో సమానమైన అవతారునిగా తీర్చిదిద్ది అవతారులకు కూడా అసాధ్యమనిపించే పరమాద్భుత కార్యమును సాధ్యపరచినారు. శ్రీరాముని బాణమునకు తిరుగులేదు. ఆయన ఆత్మశక్తి అనే బాణమును ప్రయోగిస్తే ఎంతటి స్థూలశరీరమైనా నశించిపోయి ఆత్మాభివృద్ధి కలిగితీరుతుంది. జ్ఞానలోకము వంటి మజిలీలలో ఆగిపోయి వాటిని దాటలేక పోవుచున్న ఆత్మలను శ్రీరాముడు తన ఆత్మశక్తితో ఆయాలోకాలను దాటించి ఆత్మాభివృద్ధిని ప్రసాదించి భగవంతుని వద్దకు చేరుస్తారు. శ్రీరాముని యొక్క ఆత్మజీవితమునకు సంబంధించిన ఇట్టి విషయములన్నీ శ్రీరాముని యొక్క చరిత్రలో ఉంటాయి. శ్రీరాముని కథ ద్వారా మొదట శ్రీరామభక్తి అలవరచుకొనిన పిదప, శ్రీరామచరిత్ర తెలుసుకుని శ్రీరాముడిని అనుసరించుట నేర్చుకోవలెననే ఉద్దేశ్యముతో మహర్షులు కథ, చరిత్ర అనే రెండు విధములుగా వ్రాసియున్నారు.

శ్రీరామకథలో శ్రీరావణుడు రాక్షసుడని దుర్మార్గుడని, లోకహితము కొరకు శ్రీరాముడు శ్రీరావణుని సంహరించినట్లుగా కనిపిస్తుంది. కానీ శ్రీరామచరిత్ర ప్రకారము శ్రీరావణుడు బ్రహ్మజ్ఞాని, మహాతపస్వి. తపస్సాధనతో తనలో జాలి, వైరాగ్యము, ఆత్మవిమర్శ, అనే శక్తులను మేల్కొల్పిన మహాపురుషుడు. శ్రీరావణుడు అందరిలాగే ఒకే శిరస్సుతో జీవించినారేగానీ పది తలలతో ఏమీ జీవించలేదు. శ్రీరావణుని యొక్క వైరాగ్యసాధన ఫలముగా ఆయనలో పది జ్ఞానశక్తులు ఉద్భవించినవి. ఆయనలోని పది జ్ఞానశక్తులకు సూచనగానే ఆయనకు పది తలలు ఉన్నవని వ్రాసియున్నారు. మహాజ్ఞానియగు శ్రీరావణుడు జ్ఞానమును వీడలేక సత్యమార్గములో ముందుకు సాగలేక జ్ఞానలోకము లోనే నిలిచిపోయినారు. అవతారపురుషుడైన శ్రీరాముడు తన బాణముతో శ్రీరావణుని యొక్క పదితలలను ఖండించి ముక్తిని ప్రసాదించినారు. అనగా శ్రీరాముడు తన ఆత్మశక్తితో శ్రీరావణుని యొక్క జ్ఞాన బంధములను ఖండించివేసి జ్ఞాన లోకము నుండి విముక్తిడిని చేసి, జ్ఞాన మజిలీని వదిలివేసి సత్యమార్గములో ముందుకు సాగిపోయేలాగ, భగవంతుడిని చేరుకునేలాగ ఆత్మాభివృద్ధిని కలిగించినారు అని అర్థమైయున్నది.

సద్గురుమూర్తియగు శ్రీ శేషుబాబుగారు తన ఆత్మశక్తితోను, భగవంతుడిని ప్రార్థించుట ద్వారాను జ్ఞానశక్తులను వదిలివేసి సత్యమార్గములో, సద్గురుసాధనలో ముందుకు సాగిపోయినారు.

